సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

శరవేగంగా శివాజీ పార్కు పనులు




పార్కులో పనులు చేస్తున్న కూలీలు

- రూ.1.5 కోట్ల నిధులతో సరికొత్తగా సిద్ధం
- రూ.50 లక్షలతో ఫౌంటైన్ సముదాయం ఆధునికీకరణ

ఎంవీపీ కాలనీ: నగర ప్రజలను సేదతీర్చడంలో ప్రధానమైన పార్కుల్లో శివాజీ పార్కు ఒకటి. 16 ఎకరాల విస్తీర్ణంలో 1999లో జీవీఎంసీ నిర్మించిన ఈ పార్కును ప్రస్తుతం భారీ మొత్తాన్ని వెచ్చించి ఆధునికీకరిస్తోంది. పార్కుకు వచ్చే సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచేలా మార్పులు చేస్తున్నారు. ఆధునికీకరణ, సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టిపెట్టారు. రూ.2 కోట్ల వ్యయంతో ఆయా పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. పార్కు ముఖద్వారం, ఫౌంటైన్ సముదాయాన్ని, ఆడిటోరియంను పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తున్నారు. పార్కులో ఛత్రపతి శివాజీమహారాజ్ విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేయనున్నారు.

అక్టోబర్‌లో అందుబాటులోకి..

ఆధునికీకరణ పనుల్లో భాగంగా రూ.1.5 కోట్లతో పార్కులో అభివృద్ధి, ఆధునీకరణ పనులు చేపట్టారు. పార్కు ముఖద్వారం, ఫ్లోరింగ్, సెంటర్ ప్లాజా ఫొటో షూట్ పాయింట్ ఆధునికీకరణ, టైల్స్ నిర్మాణం, పెయింటింగ్స్, లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు మెయిన్ టాయిలెట్స్, క్యాంటీన్ టాయిలెట్స్ మరమ్మతులు, ప్లంబింగ్, పాయింటింగ్ పనులు నిర్వహిస్తున్నారు. వాకింగ్ ట్రాక్ గుంతలు లేకుండా మరమ్మతులు చేపడుతున్నారు. జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియాను బాగు చేస్తున్నారు. పిల్లల ప్లే ఏరియాను, ఫొటో షూటింగ్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఫౌంటైన్‌ల సముదాయంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. అక్టోబర్ చివరినాటికి పనులు పూర్తిచేసి నగరవాసులకు అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో పనులు వేగంగా జరుగుతున్నాయి.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

బీచ్ రోడ్డు: మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. చినవాల్తేరు రజక వీధికి చెందిన కొండలరావు(49) తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. గతంలో ఈయన కానిస్టేబుల్‌గా పని చేసేవాడు. కొన్ని కారణాలతో ఆయన్ను ఉద్యోగం నుంచి తొలగించారు. అనంతరం ఆమె భార్య కూడా విడిచిపెట్టి వెళ్లిపోవటంతో మానసిక వేదనతో మదనం పడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చెపట్టారు.

క్లుప్తంగా

వైభవంగా ఉట్టి కొట్టే సంబరం



ఉట్టి కొట్టే సంబరంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

బీచ్ రోడ్డు: చినవాల్తేరులోని కొయ్య వీధి కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే సంబరం ఆదివారం వైభవంగా జరిగింది. పాలు, పెరుగు ఉట్టిలో వేసిన అనంతరం సంబరాలను ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఉట్టి కొట్టేందుకు చిన్నారులు, యువకులు ఎంతో ఉత్సాహం చూపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రవి కుమార్, కాశీ, కమల్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి వితరణ



బాలురకు నిత్యావసర సరకులు అందిస్తున్న వాయిస్ ఆఫ్ యూత్ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు డెయిరీ ఫారం సమీప ఇందిరానగర్‌లో ఆనంద్ మార్గ్ ఆశ్రమానికి వాయిస్ ఆఫ్ యూత్ స్వచ్ఛంద సంస్థ సహకారం అందించింది. సంస్థ సభ్యులు ఇక్కడ బాలురు, ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద్ అవధూతకు నిత్యావసర సరకులు ఆదివారం అందజేశారు. నోటు పుస్తకాలు, పెన్నులు, స్కూల్ బ్యాగులు, తదితర వాటిని కూడా పంపిణీ చేశారు. బాలురు క్రమశిక్షణతో చదువుకోవాలని సంస్థ సభ్యులు సూచించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులకు స్వామీజీ కృతజ్ఞతలు తెలిపారు.

భద్రం పార్కులో హనుమాన్ చాలీసా



హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న భక్తులు

ఎంవీపీ కాలనీ: స్థానిక భద్రం పార్కులో పలువురు ఆధ్యాత్మికవేత్తలు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. భారతదేశ సనాతన ధర్మ రాజ్య స్థాపనలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సామవేదం షణ్ముఖ శర్మ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హిందూ ధర్మ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం 108 సార్లు హనుమాన్ చాలీసా యజ్ఞాన్ని నిర్వహించారు. చింతామని భజన బృందంతో పాటు కర్ణాటక సంగీత విద్వాంసులు గుమ్ములూరి శారదా సుబ్రహ్మణ్యం తదితరులు వేయి మంది భక్తులతో హనుమాన్ చాలీసా సహస్ర గళార్చన చేయించారు. ఈ కార్యక్రమంలో కందాళ వెంకట సత్యశ్యామ్, అరుణా దంపతులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం



శతావధానం చేస్తున్న తాతా సందీప్ శర్మ



బేతవోలు రామబ్రహ్మంకు పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

ఏయూ క్యాంపస్: తెలుగు భాష వైభవాన్ని చాటేలా అష్టావధానం కార్యక్రమం ఆదివారం ఆంధ్ర విశ్వవిద్యాలయం వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా జరిగింది. శ్రీవిశ్వనాథ సాహిత్య పీఠం, శ్రీ కొప్పరపు కవుల కళాపీఠం సంయుక్తంగా నిర్వహించిన అష్టావధానంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి శతావధాన శరచ్చంద్ర తాతా సందీప్ శర్మ అవధానం ఆకట్టుకుంది. సభకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్. అవధాని అధ్యక్షత వహించారు. అవధాన పృచ్ఛకులుగా డాక్టర్ డి.వి.సూర్యారావు, భైవరపట్ల ఆదిత్య, పేరాల హరిప్రియ, రాళ్లపల్లి విద్యాసాగర్, సి.వి.ఆర్.మూర్తి, శేఖర మంత్రి ప్రభాకర్, భాగవతుల ఆరుద్ర మయుఖ్, రాంభట్ల నృశింహ శర్మలు వ్యవహరించారు. అనంతరం విశ్వనాథ సాహితీ పురస్కారాన్ని ఆచార్య బేతవోలు రామబ్రహ్మంకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీ వేత్త డాక్టర్ పేరి రవికుమార్, డాక్టర్ ఎస్.వి జయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపేంద్ర బీఫార్మసీ' రెండో షెడ్యూల్ ప్రారంభం



మీడియాతో మాట్లాడుతున్న నిర్మాత అచ్యుతరావు

బీచ్‌రోడ్డు: ఎస్ఎస్ఎల్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఉపేంద్ర బీ ఫార్మసీ సినిమా రెండో షెడ్యూల్ వీఎంఆర్‌డీఏ పార్కులో ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ మంచి కథతో ఈ చిత్రం తీస్తున్నామన్నారు. ఇప్పటికే విడుదల చేసిన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. చిత్రం హీరో ఉపేంద్రబాబు జన్మదినం అక్టోబర్ 29న చిత్రాన్ని విడుదల చేస్తామన్నారు. డైరెక్టర్ సాయి కుమార్ గుంటురెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే చిత్రాలను తెరకెక్కిస్తునామన్నారు. హీరోయిన్ ప్రియ, తానా సంఘం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ వితరణ



వాటర్ ఫిల్టర్ అందిస్తున్న జేసీఐ వైజాగ్ ఎక్సలెన్స్ ఆఫెక్స్ ప్రతినిధులు

మద్దిలపాలెం : సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా నౌకానగర్ జీవీఎంసీ పాఠశాలకు జేసీఐ ఎక్స్‌లెన్స్ ఆపెక్స్ ప్రతినిధులు వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీరు అందాలనే ఉద్దేశంతో ఈ వాటర్ ఫిల్టర్‌ను అందించామని జేసీఐ అధ్యక్షుడు జేఏఎం ఆమెనా తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఎఫ్ఎం శ్రావణి, మను, జేసీ స్మిత్, మానస, రాజు, పవన్, అబుబాకర్ పాల్గొన్నారు.

నగరంలో ముజిగల్ మ్యూజిక్ అకాడమీ సేవలు



ముజిగల్ అకాడమీని ప్రారంభిస్తున్న ఆర్‌పీ పట్నాయక్ తదితరులు

ఎంవీపీ కాలనీ: ముజిగల్ మ్యూజిక్ అకాడమీ సేవలు విశాఖలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎంవీపీ కాలనీలో ఏర్పాటు చేసిన ఈ అకాడమీ కార్యాలయాన్ని ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద మ్యూజిక్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్‌గా ముజిగల్ అకాడమీ నిలుస్తుందన్నారు. గాత్రం, వాయిద్యంతో సహ సంగీతం నేర్చుకోవడానికి విశాఖ యువతకు ఈ అకాడమీ మంచి అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. అకాడమీ ఫౌండర్ డాక్టర్ ఏలూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ అకాడమీ ద్వారా పియానో, కీబోర్డు, గిటార్, డ్రమ్స్, హిందుస్థానీ వోకల్స్, వెస్ట్రన్ వోకల్స్ శిక్షణ ఇస్తామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కనకరాజు

మద్దిలపాలెం : ట్రాఫిక్ నిబంధనలు తూ.చ తప్పకుండా పాటించాలని ఆటోడ్రైవర్లకు మూడో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ కనకరాజు సూచించారు. మద్దిలపాలెం ఏయూ ఆర్చ్ వద్ద గల ఆటో స్టాండ్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిగ్నల్ క్రాస్ చేసి జరిమానాలకు బలి కావొద్దన్నారు. ఓవర్ లోడుతో ఆటో నడపినా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఆటో డ్రైవర్ల ఖాకీ చొక్కా వేసుకోవాలని సూచించారు. ఆటోలను ప్రయాణికులు ఎక్కించుకోవడానికి ఇష్టానుసారంగా రోడ్డుకు అడ్డంగా ఆపడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. అలా చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, రోడ్డు పక్కగా ఆటోను ఆపి ప్రయాణికులు ఎక్కించడం, దించడం చేయాలని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



అవార్డులు పొందిన ఉపాధ్యాయులతో ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, బాలమోహన్‌దాస్

సీతంపేట: బాలవికాస్ ఫౌండేషన్, గాంధీ సెంటర్ సంయుక్తంగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన నలుగురిని సత్కరించారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మురహరిరావు ఉమా గాంధీ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన కె.వి.ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కొట్టాన రాంబాబు, విజయ్ సుశీల్ కుమార్‌లను ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు చేతుల మీదుగా సత్కరించారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, డాక్టర్ బి.రామారావు, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జారిపడిన బంగారు హారం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు రామన్నపేటకు చెందిన తమ్మిన రమ అనే మహిళ నుంచి నాలుగు తులాల బంగారు హారం ఈ నెల 6న జారిపడిపోయింది. బంధువుల ఫంక్షన్‌కు వెళ్లేందుకు కుటుంబ సభ్యులతో ఆ రోజు మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆమె జాతీయ రహదారి వద్దకు వెళ్లేసరికి మెడలో హారం కనిపించలేదు. తర్వాత వెనక్కు వచ్చి చూసుకునే సరికి ఆరో తరగతి చదువుతున్న ఒక విద్యార్థి చేతిలో హారం చూసినట్టు స్థానికులు బాధితురాలికి తెలిపారు. దీనికి సంబంధించి ఆమె 7న భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు మాట్లాడుతూ పడిపోయిన హారం తనది కాదని, ఫంక్షన్‌కు వెళ్లే నిమిత్తం తెలిసిన వారిని అడిగి వేసుకున్నట్టు లబోదిబోమంటోంది. ఈ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి పోయిన హారాన్ని గుర్తించాలని పోలీసులను బాధితురాలు కోరుతోంది.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాజంలో మద్యం షాపుల వద్ద అల్లర్లు చేయకుండా ఉండాలని, తగాదాల్లో తలదూర్చకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా జీవించాలని హితవు పలికారు. అనంతరం రౌడీషీటర్ల ను వారి ఇళ్ల వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.

పబ్లిక్ డిమాండ్

సీసీ రోడ్లు నిర్మించాలి



రామకృష్ణాపురంలో రోడ్డు మధ్యలో అడుగు ఎత్తులో ఉన్న మ్యాన్‌హోల్స్

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం ఎదురుగా ఉన్న రామకృష్ణాపురంలో సీసీ రోడ్లు నిర్మించాలి. ఈ కాలనీలో అన్నీ ఇరుకు రోడ్లే దర్శనమిస్తున్నాయి. గతంలో చేపట్టిన యూజీడీ పనుల కోసం రహదార్లు తవ్వేసి కిందన పైపులు అమర్చారు. వాటికి మధ్యలో మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేశారు. ఆ మ్యాన్ హోల్స్ అడుగు ఎత్తులో ఉన్నాయి. ఇరుకు రోడ్ల మధ్యలో అవి ఎత్తుగా ఉండడంతో నడవడానికి కూడా వీలుపడడం లేదు. కాలనీలో సీసీ రోడ్లు నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం. జీవీఎంసీ అధికారులు మా కాలనీపై దృష్టి పెట్టాలి.

– ఆర్.శ్రీనివాస్, రామకృష్ణాపురం ప్రెసిడెంట్

కనక మహాలక్ష్మికి విశేష పూజలు



పూజలో పాల్గొన్న ఆలయ అధికారులు, భక్తులు

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు ఆదివారం 25వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, భక్తులు పాల్గొన్నారు.













